# సామ్యం భోధ అను సత్యం వధ కథ

ధోరమ్ రుమతో కబుర్లు చెప్తున్నాడు. అంతకంటె ధోరమ్, రుమని చూస్తున్నాడు. రుమ కబుర్లు చెప్తోంది అనటం నిజానికి దగ్గరగా ఉంటుంది. ధోరమ్‌కి రుమంటే సొందేష్ అంత ఇష్టం. సొందేష్ తింటూ రుమని చూడటం అంతకంటే ఇష్టం. రుమకి ధోరమ్‌కి గల పలుకబడి, అధికారం అంటే ఇష్టం. అవి తన కోసం, తన వాళ్ల కోసం వాడుకోడం మరీ ఇష్టం. రుమ చేస్తున్న ఉద్యోగానికీ, ఆమెకున్న అర్హతలకీ పోలిక లేదు. అల్లాగే ధోరమ్ వయస్సుకీ అతనికున్న కోరికలకీ కూడా పోలిక లేదు. ధోరమ్‌కి మంత్రి పదవుంది. రుమకి వయస్సు, అందం ఉన్నాయి. అవి వాడుకోడానికి ఇద్దరికీ అభ్యంతరం లేదు. అందుకని రుమ, ధోరమ్‌కి దక్కితే ఆమె చేస్తున్న ఉద్యోగం ఆమెకు దక్కింది.

రుమ కబుర్లాపి 'ఏం చెప్తున్నాను?' అని అడిగింది. ధోరమ్‌కి ఆ ప్రశ్నకి జవాబు తెలియదు. కాని ప్రతి ప్రశ్నకి జవాబు చెప్పేవాడు మంత్రి పదవిలో ఎక్కువ రోజులు నిలబడలేడు. అతనిన్ని మైళ్లు రుమ కబుర్లు విని ప్రశ్నలకి జవాబు చెప్పటానికి రాలేదు. రుమ అతని చిరాకు గుర్తించి లోపలికి వెళ్లి ప్లేటులో సొందేష్ పెట్టి తీసుకువచ్చింది. ఆ ముక్కలు నోటి కందిస్తూ ధోరమ్‌తో "మా అక్కయ్య కొడుకు బొరుణ్ అయిదేళ్ల క్రితం, అంటే లోస్ట్ సెలక్షన్స్‌లో, ఒసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వేయించినప్పటినుంచి ప్రొమోషన్ లేకుండా అల్లాగే ఉండి పోయాడు. ఆ విషయమే ఇందాక మీతో చెప్తున్నాను" అంది.

'అక్కడున్న ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్, ఎవరూ రిటైరవలేదు. కనీసం చచ్చిపోలేదు. మరి బొరుణ్‌కి ప్రొమోషన్ రమ్మంటే ఎలా వస్తుంది?' అని ధోరమ్ ధర్మ సందేహం వెలిబుచ్చాడు.

'దేశంలో ఇన్ని కొత్త ఇంజినీరింగ్ కాలేజీలు పెడుతున్నారు కదా! అల్లాంటప్పుడు మన రాష్ట్రంలో మరొకటి పెడ్తే ఏం పోతుంది?' అని ప్రశ్నించింది రుమ.

కొత్త కాలేజీ పెట్టినా బొరుణ్‌కి ప్రిన్సిపాల్ ఉద్యోగం రావాలంటే చాలా కష్టం. ఎన్నో గండాలున్నాయి. ఎంతో కథ నడవాలి. ధోరమ్‌కి ఇవన్నీ గుర్తుకొచ్చి మౌనం వహించాడు. రుమ మూతి ముడుచుకుంది, లోపలికి వెళ్లి అమృతాంజనం తెచ్చుకుంది. కణతలకి

రుద్దుకుంటూ కూర్చుంది. దాని అర్థం ధౌరమ్‌కి తెలుసు. అన్నిమైళ్ళు ప్రయాణం చేసి వచ్చి వృధాగా వెనక్కి వెళ్లిపోటం అతని కిష్టం లేదు. సరేనన్నాడు. వెంటనే రుమ సబ్బుతో మొహం కడుక్కుని పౌడరేసుకునొచ్చి అతని వళ్లో వాలిపోయింది.

ధౌరమ్ ఘోష్ స్వంత ఊరు కాస్త పేరున్న పెద్ద ఊరు. ఆ ఊరువారంతా 'మా ఊరుని రాష్ట్రానికి రాజధాని చేయమని అడుగుతున్నామా? యూనివర్సిటీ పెట్టమని గొంతెమ్మ కోరిక కోరుతున్నామా? ఏం పెద్ద కోర్కె మాది! వో చిన్న ఇంజనీరింగ్ కాలేజీ పెట్టమంటున్నాం. మీరివ్వకపోతే మేము ప్రైవేటు కాలేజి పెట్టుకుంటాం' అంటూ రాష్ట్ర ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చారు. అల్లా వత్తిడి పెట్టమని ధౌరమ్ ఘోష్ సలహా ఇచ్చాడు. ధౌరమ్ ఘోష్‌కి ధర్మమూర్తన్న పేరుంది. అబద్ధం ఆడడన్న అపవాదుంది. వీటన్నింటికి మించి రాష్ట్ర శాసనసభలో మంత్రి పదవీ, ఆ పేరున్న ఊళ్లో ధరలు పెరిగే, కొద్ది భూములూ ఉన్నాయి. సాంకేతిక విద్యామంత్రి, ఇంకో ఊళ్లో అతని మేనల్లుడి చవిటి పఱ్ఱ మీదుగా ధౌరమ్ ఘోష్ రోడ్డు వేయించే షరతు మీద ఆ ఊళ్లో ఇంజినీరింగ్ కాలేజీ పెట్టడానికి ఒప్పుకున్నాడు.

మంత్రులు తల్చుకుంటే పన్లాగుతాయా! వెంటనే కమిటీలు వేసారు. ధౌరమ్ ఘోష్ ఊరు నెన్నుకున్నారు. బౌరుణ్ గుప్తాకి ప్రిన్సిపాల్ ఉద్యోగం ఇచ్చారు. అట్టహాసంగా ముఖ్యమంత్రి చేత దానికి శంఖుస్థాపన చేయించి ప్రధానమంత్రి పేరుపెట్టారు.

ఆపైన కాలేజి కట్టడానికి స్టూడెంట్లు వాడటానికి కావలసిన నీళ్లేవి? అన్న ప్రశ్న వచ్చింది. 'ప్రపంచం అంతా గ్రౌండు వాటర్ అంటూ గంగవెర్రు లెత్తుతున్నారు. కనుక దాన్ని టాప్ చేద్దాం' అనుకున్నారు. 'అంతర్జాతీయ భూగర్భ జల దశాబ్దం'కి చెందిన పెద్దలు ఆ నిర్ణయాన్ని హర్షించారు. గొట్టాల్దించారు. నీళ్లు తోడారు. షొబాష్ అంటే షొభాష్ అనుకున్నారు.

ఇల్లా ఉండగా ఒక రోజు కాలేజీ చూడ్డానికి వచ్చిన ఓ రైల్వే ఉద్యోగి మాటల్లో 'ఈ నీళ్లు మేము స్నానానికి కూడా పనికి రావని 1930 లో వదిలేసామే!' అంటూ ఆశ్చర్యపోయాడు.

'అప్పుడు భూగర్భ జల దశాబ్దం జరుగుతూ ఉండక పోవటం చేత కాబోలు' అన్న అనుమానం వెలిబుచ్చాడు బౌరుణ్ గుప్తా.

'కాదు. ఆ నీళ్లు ఎక్కడో మురుగు నీటితో కలుషిత మౌతున్నాయని మా నిపుణులన్నారు. మీరు నీటిని బోయోకెమిస్టు చేత పరీక్షింప చేసారా?' అని అడిగాడు.

'చేయించా. బాగానే ఉన్నాయన్నారు' అని రైల్వే ఉద్యోగికి సమాధానం చెప్పి పంపించేసి, అర్జెంటుగా ఆ మర్నాడు ఆ నీటిని పరీక్షకు పంపాడు బౌరణ్‌గుప్తా. అవి కలుషితమైన నీళ్లే నన్నాడు పరీక్షకుడు. బౌరుణ్ వెళ్లి ధౌరమ్ దగ్గర మొత్తుకున్నాడు. ధౌరమ్ 'మాయాబజారు'లో శ్రీ కృష్ణుడిలా చిరునవ్వు నవ్వాడు, 'పోవయ్యా మొషాయి! నువ్వు మరీ పిరికివాడివి. ప్రిన్సిపాల్‌గా ఉండటానికెల్లా పనికొస్తావ్! ఇల్లా అయితే విద్యార్థులు ప్రతి రెండు రోజులకీ ఒకసారి స్ట్రైయిక్, వారానికో ఘోరావో చేస్తారు. ఇండియాలో పారిశుధ్యం తక్కువై మనుషులు చస్తూ ఉంటే ఈ జనభా ఇంతిలా పెరిగేది కాదు. అంటే ఏమిటి? మనం అందరం గొప్ప ఇమ్యూనిటిగల వాళ్లం అన్నమాట. పైగా వయస్సులో ఉన్న విద్యార్థులు రాళ్లు తిని అరిగించుకోగల వాళ్లు. వాళ్లకీ నీళ్లో

